సాక్షి
వికారాబాద్
శనివారం । 26 । జూలై । 2025



అసైన్డ్ హక్కులపై..

భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని రైతు కమిషన్ సభ్యుడు సునీల్ అన్నారు. 8లో▸



నాణ్యమైన భోజనం..

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. 8లో▸



కిట్లు అందక..

పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కరువైంది. కనీస రక్షణ కవచాలు లేకుండా వారితో పనులు చేయిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

జిల్లా ప్రత్యేకాధికారిగా దివ్య

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలకు సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా సెర్ప్ సీఈఓ డి.దివ్యను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె వికారాబాద్‌తోపాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు కూడా స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు హెచ్‌ఎం రమేష్



రమేశ్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ మల్లేశం తదితరులు

మోమిన్‌పేట: జాతీయ స్థాయి విద్యా శిక్షణ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు రమేశ్ ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని ఎంఈఓ మల్లేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆగస్టు17నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో సీసీఆర్‌టీ కేంద్రంలో జరగనున్న జాతీయ విద్యా శిక్షణ కార్యక్రమానికి బెస్ట్ ప్రాక్టీసెస్ ఉపాధ్యాయుడిగా రమేష్ ఎంపికయ్యారని తెలిపారు.మండలంలోని ఎన్కతల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా రమేశ్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, గౌరి శంకర్,ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న మనీష్

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఇందిరానగర్‌లో పునర్నితమవుతున్న శ్రీరామ మందిరానికి తన వంతుగా ఓ ఎన్నారై రూ.1,01,000 విరాళాన్ని శుక్రవారం అందజేశారు. హైదరాబాద్ వాస్తవ్యులైన స్వర్ణలత, మనీష్ మిత్రాలు కెనడాలో స్థిరపడ్డారు. రామ భక్తులైన వారు ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు తమ విరాళాలు అందజేసి, ఆలయ పునర్నిర్మాణంలో పాత్రులు కాగలరని కమిటీ సభ్యులు కోరారు.

పెన్షన్లు పెంచాల్సిందే

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రశాంత్ మాదిగ



పెన్షన్‌దారులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: వికలాంగుల, ఒంటరి, వృద్ధుల పెన్షన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గట్టగల్ల ప్రశాంత్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తాండూరులో పెన్షన్‌దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలు, వృద్ధులు, ఒంటరి మహిళల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలన్నారు. పెన్షన్ పెంచకపోవడాన్ని నిరసిస్తూ ఆగస్టు 2న చలో కొడంగల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, తాండూరు అధ్యక్షుడు బలరాం మాదిగ, నాయకులు మీరజ్, మోహన్, సంజు, గజలప్ప,గంగమ్మ, వెంకటమ్మ, నిర్మల, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి సుధీర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అధికారులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ జాకీర్ అహ్మద్ ఉన్నారు.

క్యూ..!

జిల్లాలో ఎరువుల కోసం బారులు తీరుతున్న రైతులు

- వెంటాడుతున్న యూరియా కొరత
- అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాదారులు
- ఆందోళనలో అన్నదాతలు



ధారూరులో ఎరువుల కోసం క్యూ కట్టిన రైతులు



వికారాబాద్‌లో బారులు తీరిన అన్నదాతలు

- ప్రస్తుత సీజన్‌కు అవసరమైన ఎరువులు 1,13,851 మెట్రిక్ టన్నులు
- అందుబాటులో ఉన్నది 12,540 మెట్రిక్ టన్నులు
- అవసరమైన యూరియా 39,898 మెట్రిక్ టన్నులు
- అందుబాటులో ఉంది 6,065 మెట్రిక్ టన్నులే
- సాగు విస్తీర్ణం అంచనా 5,61,719ఎకరాలు

వికారాబాద్: జిల్లాలో ఎరువుల కొరత రైతన్నను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి వర్షాలు ముందుగానే కురిసినా మధ్యలో గ్యాప్ ఇచ్చాయి. దీంతో రైతులు వర్షాల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎడతెరపి లేకుండా వానలు కురుస్తున్న నేపథ్యంలో ఎరువులు వేసేందుకు మంచి అదునుగా మారింది. దీంతో ఎరువులు కొనేందుకు రైతులు క్యూ కడుతున్నారు. దుకాణాల వద్ద వందల సంఖ్యలో బారులు తీరుతున్నారు. ఒక్కొక్కరికి రెండు బ్యాగులు మాత్రమే ఇస్తుండటంతో మళ్లీ రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు పైపాటిగా ఎరువులు వేస్తున్నారు. వరినాట్లు కూడా ప్రారంభమవుతున్నందున యూరియాకు డిమాండ్ పెరిగింది. విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచిన అధికారులు ఎరువుల కొరతను మాత్రం తీర్చలేకపోతున్నారు. జిల్లాకు అవసరమైన ఎరువుల్లో 25 శాతం కూడా ప్రస్తుతం అందుబాటులో లేవు. డీఏపీ, యూరియా కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ఫెర్టిలైజర్ దుకాణ యజమానులు ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తున్నారు.

ఉన్నది కొంతే

జిల్లాలో ఎరువుల అవసరం కొండంత ఉంటే అందుబాటులో ఉన్నది గోరంత అన్నచందంగా పరిస్థితి తయారయ్యింది. ప్రస్తుత సీజన్‌లో 5,61,719 ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. 1,13,851 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం 12,540 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇందులో యూరియా 39,898 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటి వరకు 10 వేల మెట్రిక్ టన్నులే పంపిణీ చేశారు. మరో 5,500 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ 27,516 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 8,51 మెట్రిక్ టన్నులే ఉంది. ఎంఓపీ 8,585 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 128 మెట్రిక్ టన్నులే ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 35,305 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా 4,295 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. ఎస్ఎస్‌పీ ఎరువులు 2,547 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 201 మెట్రిక్ టన్నులే ఉంది.

బారులు తీరుతున్న రైతులు

ఎరువుల నిల్వలపై అధికారులు చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితులకు ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. ఎరువుల కొరత లేదని అధికారులు చెబుతున్నా దుకాణాల వద్ద రైతుల భారీ క్యూలు కనిపిస్తున్నాయి. పొలం పనులు కూడా వదులుకొని ఎరువుల కోసం తిరగాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు అంచనా 5.61లక్షల ఎకరాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 5.61లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గతేడాది 2.57 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ సారి2.58 లక్షల ఎకరాల్లో సాగు చేయవచ్చని భావిస్తున్నారు. వరి 1,31,075 ఎకరాల్లో, కంది 1.10 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 26,908 ఎకరాల్లో, పెసర 14,568 ఎకరాల్లో, మినుములు 5,716 ఎకరాల్లో, జొన్న 2,572 ఎకరాల్లో, సోయాబీన్ 2,043 ఎకరాల్లో, ఇతర పంటలు 7,275 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ఇప్పటి వరకు 4 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు.

ఆందోళన వద్దు



జిల్లాకు ఏమేర ఎరువులు అవసరమో ప్రభుత్వానికి నివేదిక పంపాం. సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. డీఏపీ, యూరియా పంపిణీ చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఏరోజుకారోజు ఎరువులు తెప్పించి అందుబాటులో ఉంచే ప్రయత్నం చేస్తున్నాం. ఎవరైనా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– రాజరత్నం, జిల్లా వ్యవసాయాధికారి

బీదర్‌కు బస్సు సర్వీసు ప్రారంభం

- పెద్దేముల్‌లో పూజలు



పెద్దేముల్‌లో బస్సుకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు, ప్రయాణికులు

తాండూరు రూరల్: తాండూరు నుంచి కర్ణాటక రాష్ట్రం బీదర్‌లోని నర్సింహస్వామి పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభమైంది. పెద్దేముల్, కుంచారం, జహీరాబాద్ మీదగా బస్సు బీదర్‌కు వెళ్లనుంది. శుక్రవారం పెద్దేముల్‌కు చేరుకున్న బస్సుకు కాంగ్రెస్ నాయకులు, ప్రయాణికులు పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీదర్‌కు ఆర్టీసీ బస్సు నడపాలని చాలా కాలంగా ప్రయాణికులు కోరుతున్నారని తెలిపారు. వారి కల నేడు సాకారమైందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తాండూరు బస్టాండ్ నుంచి ఉదయం 6 గంటలకు బస్సు బయలు దేరి మధ్యాహ్నం 1:30 గంటకు బీదర్‌కు చేరుకుంటుందని తెలిపారు. బీదర్‌లో సాయంత్రం 5 గంటలకు తిరిగి బయలుదేరి 9గంటలకు తాండూరుకు చేరుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో పీసీసీ మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎండీ రియాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు శేఖర్ పటేల్, శ్రీను, ఎర్ర రవి, అరవింద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

పరిగి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలని సూచించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజలకు చేసిన చూస్తున్న అన్యాయాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రేషన్ బియ్యంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకంలో కేంద్రం వాటా ఉంటుందన్నారు. అదే విషయాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

మర్పల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు వస్తాయన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని వారు ఆందోళన చెందరాదని, దశల వారీగా మంజూరు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంతరం మండలంలోని పట్లూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, గృహ నిర్మాణ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు పరిష్కారం ముంపు సమస్యా నివ్వం



తాండూరు: చిలుక వాగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్ తదితరులు

- చిలుక వాగు ప్రక్షాళన పనులను సకాలంలో పూర్తి చేస్తాం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/బషీరాబాద్: చిలుక వాగు ప్రక్షాళన పనులను సకాలంలో పూర్తి చేసి ముంపు సమస్యను పరిష్కరిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని కొడంగల్ – హైదరాబాద్ మార్గంలో చిలుక వాగుపై నిర్మించిన బ్రిడ్జిని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి పనుల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డు అనుసంధాన పనులను ప్రారంభించాలని సూచించారు. చిలుకవాగు ప్రక్షాళనకు మరో రూ.40 కోట్లు అవసరం అవుతాయని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నియోజకవర్గంలోని చెంచు కుటుంబాలకు ఇళ్లు మంజూరైన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చైతన్య నగర్ శివారులోని మూడెకరాల స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు అడ్డు చెబుతున్నారని తహసీల్దార్ వెంకటప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సర్వే నంబర్ 114, 115లో ఉన్న స్థలాన్ని చెంచుల ఇళ్ల కోసం కేటాయించాలని కోరారు. ఇళ్ల నిర్మాణానికి భూమి కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

సొసైటీలకు ప్రభుత్వ సహకారం

రైతు సహకార సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బషీరాబాద్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.2.65 కోట్లతో నిర్మించిన రైస్ మిల్లు, గోదాంను డీసీసీబీ చైర్మన్ సత్యయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీలకు వచ్చే ఆదాయంతో రైతులకు మరిన్ని రుణాలు ఇవ్వాలని సూచించారు. సొసైటీ పాలకవర్గాలను ఆగస్టు వరకు పొడగించినట్లు తెలిపారు. యాలాల, తాండూరు మండలాల్లో చేపట్టిన గోదాంలు, రైస్ మిల్లులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవి గౌడ్, చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, డీసీఓ నాగార్జున,నాయకులు అజయ్‌ప్రసాద్,నర్సింలు,రాము, చందర్, సొసైటీ సీఈఓ వెంకటయ్య పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

- సీసీ టీవీల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి: పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగించాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ చాలా కీలకమన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న సంఘటనలను తక్కువ అంచనా వేయరాదని వాటిపై నిఘా ఉంచాలని తెలిపారు. యువత తప్పుతోవ పట్టించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే ముప్పును ప్రజలకు, యువతకు తెలియజేయాలన్నారు. గంజాయి రవాణ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై మోహన్ కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి



మాట్లాడుతున్న వెంకటరత్నం

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

అనంతగిరి: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం కోరారు. ఇదే అంశంపై ఆగస్టు ఒకటిన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం వికారాబాద్‌లో యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్పందించి అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. ఎస్ఏ, పీఎస్ హెచ్‌ఎం, జీహెచ్‌ఎం ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌లు పునరుద్ధరించాలన్నారు. 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని, బీఈడీ, డీఈడీ ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులను పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. జీవో 11 , 12ను అనుసరించి ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించాలని, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

బొంరాస్‌పేట: క్షయ వ్యాధి(టీబీ) పరీక్షలు చేయించుకొని, జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యానికి మేలని టీబీ జిల్లా అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుంకిమెట్లలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిబిరం నిర్వహించారు. క్షయ నివారణకు తగు జాగ్రత్తలు చెప్పారు. వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఏజెంట్లను ఎంపిక చేసుకోవాలి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

అనంతగిరి: జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆయా పార్టీల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, భవనాల గుర్తింపు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రం పరిధిలో 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని 118 పోలింగ్ కేంద్రాల్లో 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటి పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, వివిధ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, సత్యనారాయణ, ఫెరోజ్, రాజేందర్ గౌడ్, అనిల్ యాదవ్, మహిపాల్, సతీష్ పాల్గొన్నారు.



వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పాఠశాలల్లో గ్రంథాలయం తప్పనిసరి



దుద్యాల్: ప్రతి పాఠశాలలో గ్రంథాలయం తప్పని సరిగా ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని ఎస్‌సీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు దీపక్, జైలు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయం ఏర్పాటు చేసి పుస్తకాలను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు హిందూ బంధువుల సమ్మేళనం

తాండూరు టౌన్: హిందూ బంధువుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు హిందూ వాహిని సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. పలు రంగాల్లో స్థిరపడి హిందూ ధర్మ రక్షణ కోసం అహర్నిశలు సమాలోచన చేస్తూ, భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్న హిందూ ధర్మ పరిరక్షకులను ఒకే వేదిక మీదకు తీసుకురావడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగదీష్ కారంత్ పాల్గొననున్నట్లు చెప్పారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సభ్యులు కోరారు.

పరిశుభ్రతకే ప్రాధాన్యం


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్..

నవాబుపేట: ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో అధికారులు పారిశుద్ధ్య చర్యలు ప్రారంభించారు. శుక్రవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన 'అపరిశుభ్రంగా ఎంపీడీఓ ఆఫీస్' వార్తకు యంత్రాంగం స్పందించింది. కార్యాలయం చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెట్లు, చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగించారు. ఎంపీడీఓ ఆఫీస్ పరిసరాలనే కాకుండా గ్రామాల్లో సైతం పరిశుభ్రతపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని..

పేన్ల మందు తాగిన బాలిక

కుల్కచర్ల: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేదని ఓ బాలిక పేన్ల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ మండలం చెంచుపల్లికి చెందిన బాలిక(11) కుల్కచర్లలోని కేవీఎం పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. తనకు చదువుకోవడం, హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని గురువారం ప్రిన్సిపల్ సాయి వద్దకు వెళ్లి చెప్పింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బాలికతో మాట్లాడించారు. ఇదిలా ఉండగా సదరు విద్యార్థిని శుక్రవారం ఉదయం తలకు పెట్టుకునే పేన్ల మందు తాగి అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

లీగల్‌సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా హనుమంతు


నియామకపత్రం అందుకుంటున్న హనుమంతు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ధారూరు మండలం అంతారం గ్రామానికి చెందిన భ్యాగారి హనుమంతు పీసీసీ లీగల్‌సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ భిక్షమయ్య గౌడ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీసీసీ లీగల్ సెల్‌కు నా వంతు సహకారం అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ దేవగౌడ్, రాష్ట్ర కన్వీనర్ కుర్మ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ హక్కులపై ప్రభుత్వం దృష్టి

- రైతు కమిషన్ సభ్యుడు భూమి సునీల్
- పూడూరు, తాండూరులో 'సాగు న్యాయ యాత్ర'


పూడూరు: సమావేశంలో మాట్లాడుతున్న భూమి సునీల్

పూడూరు: ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందని రైతు కమిషన్ సభ్యుడు, భూ భారతి రూపకర్త భూమి సునీల్ అన్నారు. సాగు న్యాయ యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి ద్వారా ఆర్‌ఎస్‌ఆర్ భూ విస్తీర్ణంలో మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్ వంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని రాష్ట్రంలోని రైతులు కోరుతున్నారని, ప్రభుత్వం ఈఅంశాన్ని పరిశీలిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూదాన్‌బోర్డు మాజీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, లీప్స్ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, అగ్రికల్చర్ ఓఎస్డీ హరి వెంకటప్రసాద్, ఏడీఏ రాజరత్నం, తహసీల్దార్ భరత్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ చట్టాలపై అవగాహన ఉండాలి

తాండూరు రూరల్: భూ చట్టాలపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని రైతు కమిషన్ సభ్యుడు, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్ అన్నారు. సాగు న్యాయ యాత్రలో భాగంగా శుక్రవారం తాండూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 200 పైగా భూ చట్టాలు ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ ఉన్న భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఏఓ కొమురయ్య, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో రైతు చట్టాలు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారని భూమి సునీల్ అన్నారు. ధారూరు రైతు వేదికలో శుక్రవారం రాత్రి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతు నాయకుడు మహ్మద్ బాబాఖాన్, ఏఓ సూర్యప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐ రాఘవేందర్‌రెడ్డి, ఏఈఓలు సంజూరాథోడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించడమే లక్ష్యం..

పరిగి: రాష్ట్రంలోని రైతులకు భూ చట్టాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని భూమి సునీల్ అన్నారు. గడిసింగాపూర్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీకుమార్, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైల్‌రెడ్డి

బషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటుతుందని ఆ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగల శ్రీశైల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి శ్రీశైల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు సొంతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడేళ్లలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీ నేనని అన్నారు. కార్యకర్తలకు అండగా మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఉంటారని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు మునీందర్‌రెడ్డి, రంగారెడ్డి, అనంతయ్య, రవీందర్‌సింగ్, పాండురంగారెడ్డి, శివరాంనాయక్, జయమ్మ, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేంద్రయ్య, రజాక్, క్రిష్ణ, సునీల్ ప్రసాద్, తాహెర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి

బీఆర్‌ఎస్‌వీ నాయకుల డిమాండ్


కళాశాల ఆవరణలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: ఏపీ జల దోపిడీపై నోరు మెదపని ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్‌ఎస్‌వి నాయకులు, దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ కోట్ల మైపాల్, ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఏపీ జల దోపిడీపై పోస్టర్ విడుదల చేస్తూ మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి నది నుంచి 200 టీఎంసీల నీటిని ఏపీ ప్రభుత్వం తరలించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ద్రోహానికి విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని కేసీఆర్ పిలుపునిచ్చారని పేర్కొన్నారు. కుట్రలను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలను చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు రవిగౌడ్, మల్లేశ్‌గౌడ్, మల్లేష్, రాజశేఖర్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై పీఎస్‌లో ఫిర్యాదు


షాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

షాబాద్: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, పార్టీ నాయకులు గౌరీశ్వర్, ఆంజనేయులు, యాదయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెన

- వెంకిర్యాల వాగులో బోల్తాపడిన డీసీఎం
- బ్రిడ్జి నిర్మించాలని స్థానికుల డిమాండ్

కొందుర్గు: వెంకిర్యాల వంతెన నిర్మాణం పనులు అర్ధతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే వాగు ప్రవహించి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు బారికేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలను నిలిపివేశారు. శుక్రవారం ఉదయం కర్ణాటకలోని హుబ్లీ నుంచి కొందుర్గులోని దివ్యశక్తి పరిశ్రమకు ముడిసరుకు తీసుకువస్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి వాగులో బోల్తాపడింది, అదృష్టవశాత్తు డ్రైవర్ శివరుద్రయ్య, క్లీనర్ సదానంద్ ప్రాణాలతో బయటపడ్డారు.

పలుమార్లు హెచ్చరించిన సాక్షి..

వంతెన నిర్మాణానికి పునాదులు తీసి దాదాపు ఏడాది దాటింది. ఈ విషయమై గతంలో సాక్షి పలుమార్లు కథనాలు ప్రచురించినా అధికారుల్లో చలనం కనిపించలేదు. తాజాగా ఈనెల 23న ×వంతెన అంతేనా? శీర్షికతో వచ్చిన కథనంపై స్పందించిన షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్‌ఐ రవీందర్‌నాయక్ బ్రిడ్జిని పరిశీలించి వాహనాల రాకపోకలను నిలిపివేయించారు. రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వాగులో బోల్తాపడిన డీసీఎంను ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గణపతి, పంచాయతీరాజ్ ఏఈ మధు వంతెనను పరిశీలించారు. ఇప్పటికైనా వంతెన నిర్మాణ పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

ఎండిన వృక్షం.. తొలగించకపోతే నష్టం



అనంతగిరి: వికారాబాద్ పట్టణం మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని ప్రధాన రోడ్డు పక్కనున్న ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా మారింది. ఇదే వృక్షం నుంచి గతంలో కొమ్మలు విరిగి పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ చెట్టు పూర్తిగా దెబ్బతినే ఆస్కారం ఉంది. అనుకోని ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వృక్షాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో దొంగ!

గతేడాది పెద్దేముల్ వైన్స్‌లో చోరీకి పాల్పడ్డ దుండగుడు

యాలాల: మండల కేంద్రంలోని వైన్స్‌లో జరిగిన చోరీ ఘటనలో కొత్త మలుపు వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో గతేడాది పెద్దేముల్ మండలంలో జరిగిన చోరీ కేసు చిక్కు ముడి వీడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని యాలాల వైన్స్‌లో గోడకు కన్నం వేసి విలువైన మద్యం బాటిళ్లతో పాటు రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరా హార్డ్ డిస్కును సైతం ఎత్తుకెళ్లడంతో పోలీసులకు చోరీ కేసు సవాలుగా మారింది. గతంలో చోరీలకు పాల్పడే అనుమానితులను పీఎస్‌కు తరలించి విచారణ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. ఈ క్రమంలో ఓ దొంగను ప్రశ్నించిన పోలీసులకు ఊహించని విధంగా మరో చోరీ కేసు చిక్కు ముడి వీడింది. గతేడాది పెద్దేముల్ మండల కేంద్రంలోని వైన్స్‌లో జరిగిన చోరీని తానే చేశానని, యాలాలలో చేసింది ఎవరో తనకు తెలియదని అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఈ విషయాన్ని పెద్దేముల్ పోలీసులతో పాటు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. కాగా యాలాల వైన్స్‌లో ఒకరి కంటే ఎక్కువ మంది ఉండొచ్చనే అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. చోరీ కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతుల్లేని క్లినిక్‌లు సీజ్


చౌదరిగూడలో క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నడుపుతున్న పలు ఆస్పత్రులను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సీజ్ చేశారు. మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లక్ష్మీ ప్రసన్న క్లినిక్, రమ్య క్లినిక్‌లను సీజ్ చేశారు. అలాగే ఎలాంటి బోర్డు లేకుండా చంద్రకాంత్ అనే వ్యక్తి నడుపుతున్న మరో క్లినిక్‌ను సైతం మూసేయించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమృత జోసెఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసు, పీహెచ్‌ఎన్ లుథియా, ఎంపీహెచ్‌ఓలు మున్వర్, శ్రీనివాసు, రాఘవులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్


భోజన నాణ్యతను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

యాలాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గది, కూరగాయలు, వంటపాత్రలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందించే భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తాజా, వేడి భోజనం అందించాలని సూచించారు. వర్షాకాలంలో తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులకు భోజనంతో పాటు వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

పాఠాలు బోధించిన సబ్ కలెక్టర్

కాగా కేజీబీవీలో తనిఖీలు నిర్వహించిన సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ కొద్ది సేపు ఉపాధ్యాయుడిగా మారారు. పదో తరగతి విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించి, పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగారు. వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటస్వామి, కేజీబీవీ ఎస్‌ఓ మంగమ్మ, సీఆర్టీలు క్రిష్ణవేణి, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

అనంతగిరి: రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ లోని పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగానికి ఎరువులు, విత్తనాలు సరైన మోతాదులో అందుబాటులోకి ఉంచకుండా చేస్తుందని ఆరోపించారు. రైతుల నడ్డి విరుస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఎరువులు అందుబాటులో ఉంచాలని, కల్తీ విత్తనాలు అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఎరువుల కోసం దుకాణాల ముందు బారులు తీరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్, జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, సతీష్, నవీన్, శ్రీనివాస్, శ్రీనునాయక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్


వంట తయారీ సిబ్బందితో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

కొడంగల్ రూరల్: విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి, డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్ సూచించారు. శుక్రవారం పట్టణ శివారులోని కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించారు. వంట గదిలోని సరుకులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగారు. నిత్యం రుచికరమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలు, హాస్టల్ గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఉషశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతకుంటలో కేంద్ర బృందం పర్యటన


పంట పొలాలు పరిశీలిస్తున్న నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు

ధారూరు: నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు శుక్రవారం మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో పర్యటించారు. ముందుగా జాతీయ ఉపాధిహామీ పథకానికి సంబంధించిన పనులను పరిశీలించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరైన సీసీ రోడ్లను తనిఖీ చేశారు. తర్వాత గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పశువుల పాక, రోడ్డు ఇరువైపులా ప్లాంటేషన్, వ్యవసాయ భూములను వెళ్లడానికి మట్టి రోడ్డు, నర్సరీల నిర్వహణపై ఆరా తీశారు. మహిళ పొదుపు సంఘాలు, పింఛన్‌దారులు, ఉపాధిహామీ కూలీలను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీఉల్లా, ఇన్‌చార్జి ఏపీఓ రమేశ్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లను ప్రైవేట్‌పరం చేయొద్దు

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

అనంతగిరి: ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లను కార్పొరేటర్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి వీలుగా తీసుకువచ్చిన నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం నుంచి కార్పొరేట్ సంస్థలు వైదొలగాలని, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ, కేంద్ర పాలకుల రైతు వ్యతిరేక విధానాలకు ప్రతిఘటిస్తూ నిరసనగా ప్రదర్శనలను చేయాలన్నారు. ఆహార పంటలు మొక్కజొన్న, సోయా, గోధుమ, పాల ఉత్పత్తిలను అమెరికా నుంచి చౌకగా దిగుమతి చేసుకొనే వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలన్నారు. అప్పుల విష వలయంలో కూరుకుపోయిన రైతులకు రుణ మాఫీ చేయాలన్నారు. గ్రామాల్లో గృహాలకు 300 యూనిట్లను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. అనంతరం వికారాబాద్ జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ.. రైతు పండిస్తున్న ఆహారాన్ని తీసుకునే ప్రతిఒక్కరూ రైతు సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభులింగం మాట్లాడుతూ.. అమెరికాలో 36% సబ్సిడీలు పొందిన కార్పొరేట్ కంపెనీలు పండించిన పంటలను భారతదేశానికి చౌకగా దిగుమతి చేసుకునే అవకాశం కల్పిస్తూ మోదీ ట్రంప్‌తో చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులు నరేంద్ర ప్రసాద్, గోపాల్‌రెడ్డి, సురేష్, వెంకటేష్, అనంతయ్య, అబ్దుల్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో షాద్‌నగర్‌వాసి



మాట్లాడుతున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: హనుమకొండలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సెమినార్ నిర్వహించారు. దీనికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి రాసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ ఇట్స్ సోషల్ ఎకానమీ ఇంపాక్ట్ ఆన్ ది ఫ్యూచర్ వర్క్ అనే పరిశోధన పత్రం ఎంపికైంది. సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తాను రాసిన పరిశోధన పత్రంపై ప్రసంగించారు.